నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు అర్బన్: పట్టణంలో సజ్జాపురం, తణుకు సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్స్ మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ డివిజినల్ ఇంజనీరు కె.నరసింహమూర్తి తెలిపారు. పట్టణ పరిధిలోని రామకృష్ణ మఠం, సజ్జాపురం, ఆపిల్ హాస్పటల్ ప్రాంతాలతోపాటు భాష్యం స్కూలు నుంచి గ్రాండ్ గోస్తనీ ఏరియా వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్యం విక్రయదారుడి అరెస్టు

తణుకు అర్బన్: మండలంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న దుకాణదారుడు కొప్పన దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసి 3 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. తణుకు మండలంలో గురువారం నిర్వహించిన దాడుల్లో భాగంగా మండపాక గ్రామంలోని కిళ్లీ దుకాణంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్నందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అనుమతులు లేకుండా దుకాణాల్లో మద్యం సేవించేందుకు అనుమతించిన వ్యక్తులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎస్‌ఐ ఆర్ మధుబాబు, సిబ్బంది అప్పలస్వామి పాల్గొన్నారు.

తళుక్కుమంటున్న తణుకు

- వాణిజ్యంలో ప్రథమం
- పారిశ్రామికంగా ఎదిగిన ప్రాంతం
- విద్య, వైద్యానికి ప్రధాన కేంద్రం



తణుకు పట్టణం వ్యూ

తణుకు అర్బన్: వ్యాపార వాణిజ్యపరంగా దినదినాభివృద్ధి చెందుతున్న తణుకు ప్రాంతమంటే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనే ప్రశాంతకరమైన పట్టణంగా ప్రసిద్ధి చెందింది. పచ్చటి పైరుతో పరిశుభ్రతకు మారుపేరుగా ఉండే తణుకులో స్థిరపడడానికి దూర ప్రాంతాల నుంచి సైతం వలసలు వస్తుంటారు. అంతేకాకుండా పట్టణ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం విస్తరించి భారీ లేఅవుట్‌లు వేయడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి తణుకులో నివాసాలు ఏర్పరచుకుని సెటిల్ అవ్వాలనే భావనలో ప్రజానీకం ఉంటారు. దీంతో తణుకు జనాభా కూడా గణనీయంగా పెరుగుతోంది.

పరిశ్రమలకు పెట్టింది పేరు..

ఆంధ్రా సుగర్స్ పేరుతో చెరకు పరిశ్రమ ద్వారా చెరకు ఉత్పత్తితో పంచదార తయారు చేయడమే కాకుండా రాకెట్ ఇంధనాన్ని సైతం ఇక్కడి నుంచే ఎగుమతి అవుతుందంటే తణుకు ఖ్యాతి ఎంతమేరకు విస్తరించి ఉందో తెలుస్తోంది. ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్, గౌతమి ఆయిల్ సాల్వెంట్ పేరుతో ఆయిల్ ఉత్పత్తి, స్పిన్నింగ్ మిల్లులు, పేపరు మిల్లులు వంటి పరిశ్రమలతో వేలాది మందికి ఉపాధి దొరికే ప్రాంతంగా తణుకు గుర్తింపు పొందింది.

అపజయాలను విజయానికి మెట్లుగా మలుచుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: జీవితంలో ఎదురయ్యే అపజయాలను విజయానికి మెట్లుగా మలుచుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. గురువారం రాత్రి మండలంలోని పెదతాడేపల్లి భారతీయ విద్యాభవన్స్ 40వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ నాగరాణి పాల్గొని మాట్లాడుతూ విద్య దేశ భవిష్యత్ వంటిదన్నారు. విద్యార్థులు భవిష్యత్ నిర్మాతలని పేర్కొన్నారు. కలలు, కష్టపడే తత్వమే విద్యార్థులను విజయాల వైపు నడిపిస్తుందన్నారు. భవన్స్ సంస్థ ఇంతటి విజయానికి సహకరిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రతి విద్యార్థి తమ కలలను సాకారం చేసుకోవాలన్నారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బనో, తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, భారతీయ విద్యాభవన్స్ చైర్మన్ యుకే. విశ్వనాథరాజు, వైస్ చైర్మన్లు బీహెచ్. అచ్యుత రామరాజు, త్రిలోకనాథరాజు, నాగేంద్రప్రసాద్, సెక్రటరీ, కరస్పాండెంట్ ఎస్.శ్రీరామరాజు, అసోసియేట్ సెక్రటరీ పి.సత్యనారాయణ, కోశాధికారి సురేష్‌బాబు, ప్రిన్సిపల్ రాజీవ్‌కుమార్ శర్మ, హెచ్‌ఎం శివగామి సుందరి, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

అత్తిలి: మండలంలో వరిఘేడు, తిరుపతిపురం గ్రామాలలో సహకార సంఘాల ఎరువుల గొడౌన్‌లను మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ గురువారం తనిఖీ చేసారు. మండలంలో అన్ని ఎరువుల దుకాణాలలో ఎరువులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. ఎరువుల డీలర్లు ఎరువుల అమ్మకాలు ఎప్పటికప్పుడు ఈపోస్ మెషిన్‌లో నమోదు చేయాలని తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

తణుకు అర్బన్: పట్టణంలో శ్రీవసుంధర ఆడియో అండ్ వీడియో టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వృద్ధులు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గురువారం రాత్రి బస్టాండ్, రైల్వేస్టేషన్, ఆర్వోబీపై తలదాచుకున్న వృద్ధులకు ఈ సాయం అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గుడాల శ్రీనివాస్, యర్రంశెట్టి కిషోర్ చెప్పారు. ప్రతి ఏడాది శీతాకాలంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు యర్రంశెట్టి గంగాధరరావు, కోశాధికారి చంటి, సభ్యులు ఏసు పాల్గొన్నారు.

ఘనంగా వాకర్స్ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారత్సోవం పట్టణంలో గురువారం వాకర్స్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ గుంటూరి రామరాజు ముఖ్య అతిథిగా హాజరైయారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా తిరుమళ్ల సూరిబాబు, సెక్రటరీగా అల్లూరి శ్రీనివాస్, కోశాధికారిగా మల్లారెడ్డి సారధి, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవం చేశారు. వక్తలు మాట్లాడుతూ అసోసియేషన్ మరిన్న సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలన్నారు. డాక్టర్ కంచర్ల లక్ష్మీనరసింహం, వ్యవస్థాపక అధ్యక్షుడు కూచిపూడి వెంకట కృష్ణారావు, బీఐ రాజేంద్ర, కె.నరసింహమూర్తి, రాగిరెడ్డి ప్రసాద్, ప్రవా శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోడి పందేలు, జూద క్రీడలు నిర్వహిస్తే కఠినచర్యలు

తణుకు అర్బన్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి పందేలు, గుండాట వంటి జూద క్రీడలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్‌వర్మ అన్నారు. హైకోర్టు జూద క్రీడలపై నిషేద ఆజ్ఞలు విధించిన పరిస్థితుల్లో గురువారం తణుకు తహసీల్దార్ కార్యాలయంలో పోలీసు, రెవెన్యూ, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండుగను బంధువులు, కుటుంబసభ్యులతో ఆనందంగా నిర్వహించుకోవాలని కోరారు. కోడి పందేలు, జూద క్రీడలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తణుకు పట్టణ, రూరల్ పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

అత్తిలి: సంక్రాంతి సందర్భంగా మండలంలో కోడిపందేలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ దశిక వంశీ హెచ్చరించారు. కోడిపందేలకు స్థలాలు ఇచ్చినా, కత్తులు సమకూర్చినా, బరులు ఏర్పాటు చేసినా, పేకాట, గుండాట, కోతాట, అక్రమ మద్యం విక్రయించినా చర్యలు తప్పవన్నారు. కోడిపందేలు నిరోధం కోసం మండల, గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తే సమాచారం పంచాయతీ కార్యదర్శికి, వీఆర్వోలకి, పోలీసులకు తెలియజేయాలన్నారు.

డీఆర్‌జీ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 36 మందికి ఉద్యోగాలు

పెంటపాడు: మండలంలోని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణ ఎంపికలలో 36 మంది ఉద్యోగాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్, ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికలలో ముత్తూట్ ఫైనాన్స్, టీమ్ లీజ్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన భారీ సంఖ్యలో నిరుద్యోగులు ఈ ఇంటర్వ్యూలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల అధ్యాపకురాలు ఎం. ఇందిరమ్మ, జేకేసీ ప్రతినిధి సుజాత, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల తనిఖీ

ఇరగవరం: సామాజిక పింఛన్ల తనిఖీలో భాగంగా గురువారం ఇరగవరం మండలం కె.ఇల్లింద్రపర్రు, సూరంపూడి, తూర్పు విప్పర్రు, కె.కుముదవల్లి గ్రామాల్లో మంచానికే పరిమితమైన పెన్షనర్లను అధికార బృందం తనిఖీ చేసింది. ఈ తనిఖీలో స్టేట్‌టీం ఎం డాక్టర్ జాన్ హరీషణ్, జిల్లా టీఎం డాక్టర్ సుష్మా, డాక్టర్ క్రాంతి రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీమా చేయించుకోవాలి

పెంటపాడు: రైతుల కోసం ప్రధానమంత్రి ఫసలీ బీమా గడువును ఈనెల 15 వరకు పెంచినట్లు మండల వ్యవసాయాధికారి కె. పార్థసారథి పేర్కొన్నారు. ప్రతి రైతు పంటకు ప్రధానమంత్రి ఫసల్ బీమా చేయించుకుని ధీమాగా ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.